అప్రమత్తతతోనే వ్యాధుల నియంత్రణ


సదస్సులో పాల్గొన్న కార్పొరేటర్ నర్సింహారెడ్డి

మన్సూరాబాద్: ప్రజలు వ్యాధుల బారిన పడకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. అంతర్జాతీయ మలేరియా దినోత్సవం సందర్భంగా శుక్రవారం డివిజన్ పరిధిలోని కాస్మోపాలిటన్ కాలనీలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ మన ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. నీరు నిల్వ ఉంటే దోమలు వృద్ధి చెంది మలేరియా, డెంగ్యూ వ్యాధులు సంభవించే ప్రమాదం ఉందన్నారు.కార్యక్రమంలో ఎంటమాలజీ ఎస్ఈ మాధవరెడ్డి, ఎఈ రవీంద్రారెడ్డి, కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు రుద్ర లక్ష్మీనర్సింహ్మా, ఎంటమాలజీ సిబ్బంది, కాలనీవాసులు, నాయకులు పాల్గొన్నారు.

బ్లడ్ బ్యాంక్ కాలనీ నూతన కార్యవర్గం ఎన్నిక

హయత్‌నగర్: హయత్‌నగర్ డివిజన్‌లోని బ్లడ్ బ్యాంక్ కాలనీ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నర్సింహ్మారెడ్డి, ఉపాధ్యక్షులుగా ఎస్.జంగారెడ్డి, కె.మల్లేష్ యాదవ్, ప్రధాన కార్యదర్శిగా గాలయ్యగౌడ్, కోశాధికారిగా ఎ.సుధాకర్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శిగా కె.మాధవ రెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శులుగా ఎస్.వెంకట్ రెడ్డి, ఎ.లింగారెడ్డి, సలహాదారులుగా వి.మల్లారెడ్డి, ఎస్.లింగయ్యలను ఎన్నుకున్నట్లు తెలిపారు.

కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం ఏర్పాటుకు చర్యలు


సమావేశంలో పాల్గొన్న పున్న గణేష్ నేత తదితరులు

నాగోలు: కొత్తపేట చౌరస్తాలో ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ భారీ కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు ఎల్‌బీనగర్ సర్కిల్ పద్మశాలి సంఘం అధ్యక్షుడు పున్న గణేష్ నేత అన్నారు. శుక్రవారం ఎల్‌బీనగర్ సర్కిల్ పద్మశాలి సంఘం కార్యాలయంలో కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహ ప్రతిష్టాపనపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొండా లక్ష్మణ్ తన జీవితమంతా ప్రజల సంక్షేమానికే అంకితం చేశారన్నారు. రాష్ట్ర సాధనకు తన మంత్రి పదవినే వదులుకుని ఉద్యమ బాట పట్టారని గుర్తు చేశారు. అలాంటి గొప్ప మనిషి విగ్రహాన్ని కొత్తపేటలో ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమన్నారు. బాపూజీ స్ఫూర్తిని రాబోయే తరాలకు ఆదర్శంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు చిలివేరు కాశీనాథ్, గజం అంజయ్య, కర్నాటి ధనంజయ, తడక యాదగిరి, గుజ్జ సత్యం, కోమటి సత్యనారాయణ, గంజి కిషోర్, రాపోలు సుధాకర్, శ్రీశైలం, సూర్యనారాయణ, భగవాన్ ,కొకుంట్ల రవితేజ, గడ్డం లక్ష్మీనారాయణ, జిల్లా జగన్నాథం, రావిరాల సంధ్యారాణి పాల్గొన్నారు.

ముగ్గురు నకిలీ డాక్టర్లపై కేసులు నమోదు


ఇంజాపూర్‌లోని లైఫ్‌కేర్ పాలీ క్లినిక్‌ను తనిఖీ చేస్తున్న దృశ్యం

హస్తినాపురం: ఎలాంటి విద్యార్హత లేకుండా ఆసుపత్రులను ఏర్పాటు చేసి ప్రజల పాణాలతో చెలగాటమాడుతున్న ముగ్గురు నకిలీ డాక్టర్లపై వనస్థలిపురం పోలీసులు కేసులు నమోదు చేశారు. వనస్థలిపురం పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. ఇంజాపూర్ గ్రామంలో లలిత క్లినిక్ నిర్వహిస్తున్న పి.శ్రీనివాస్ అనే వ్యక్తి 10 తరగతి పూర్తి చేశాడు. అతను ఆసుపత్రి ఏర్పాటు చేసి డాక్టర్‌గా చలామణీ అవుతూ ప్రజల ప్రాణాలతో చెలగాటాడుతున్నాడని మెడికల్ కౌన్సిల్‌కు ఫిర్యాదు అందింది. దీనిపై స్పందించి కౌన్సిల్ వైస్‌చైర్మన్ డాక్టర్ జి. శ్రీనివాస్ తన బృందంతో కలిసి దాడులు నిర్వహించారు. ఆసుపత్రి నిర్వాహకుడు ఎలాంటి అర్హతలేకుండా ఆసుపత్రిని నడుపుతున్నట్లు గుర్తించి వనస్థలిపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

- అదే గ్రామంలో లైఫ్‌కేర్ పాలిక్లినిక్ ఏర్పాటు చేసి ప్రజలప్రాణాలతో ఆటలాడుకుంటున్న వ్యక్తిపై తెలంగాణ మెడికల్ కౌన్సిల్‌కు ఫిర్యాదు అందడంతో కౌన్సిల్ వైస్ చైర్మన్ డాక్టర్ జి.శ్రీనివాస్ శుక్రవారం విచారణ చేపట్టారు. ఆసుపత్రి నిర్వాహకుడు ఎడి.డి బాబు బీఎస్సీ చదువుతూ మధ్యలో ఆపివేసినట్లు విచారణలో తేలడంతో వనస్థలిపురం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు బాబుపై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మరో సంఘటనలో ..
వనస్థలిపురం బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని గాయత్రీ నగర్‌లో వెంకటేశ్వర క్లినిక్‌పై దాడి చేసిన అధికారులు క్లినిక్ నిర్వాహకుడు శ్రీధర్‌రావుకు ఎలాంటి విద్యార్హత లేనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఉగ్రవాదంపై నిరసన గళం

పలు ప్రాంతాల్లో నిరసన ప్రదర్శనలు	పార్టీలకు అతీతంగా పాల్గొన్న నాయకులు	హోరెత్తిన నినాదాలు

పహల్గామ్‌లో మారణకాండను ప్రతి ఒక్కరూ ఖండిస్తున్నారు. అభంశుభం తెలియని టూరిస్టులను టార్గెట్‌గా చేసుకుని ఉగ్రవాదులు చేసిన నేరమేధం క్షమార్హం కాదంటున్నారు. ఉగ్రవాద నిర్మూలనలో భాగంగా పాకిస్తాన్‌కు అన్ని రకాల సహాయ సహకారాలు నిలిపివేయాలని కోరుతున్నారు. ఉగ్రవాద సమస్య కేవలం భారత్‌దే కాదు..ప్రపంచంలోని అన్ని దేశాల్లో ఉగ్రవాదంపై ఉమ్మడిగా పోరాడాలన్నారు. పాకిస్తాన్ ఉగ్రవాదులను పెంచి పోషిస్తున్న విషయాన్ని ప్రపంచ దేశాలు గుర్తించాలన్నారు. -చంచల్‌గూడ

ఉగ్రవాదులను తక్షణమే ఉరితీయాలి



ప్రపంచ వ్యాప్తంగా పలు దేశాల్లో జైళ్లలో ఉన్న ఉగ్రవాదులను తక్షణమే ఉరితీయాలి. ఉగ్రవాద సంస్థలతో సంబంధం ఉన్న వారికి మరణ శిక్ష విధించేలా చట్టాలు తీసుకురావాలి. ప్రపంచలోని ఉగ్రవాద సంస్థలు, ఉగ్రవాదుల నామరూపం లేకుండా చేయాలి. మోదీ నాయకత్వంలో ప్రపంచంలోని అన్ని దేశాలు ఉగ్రవాదాన్ని తుదముట్టించేందుకు సంఘటితం కావాలి.
-సహదేవ్‌యాదవ్, మాజీ కార్పొరేటర్

పాకిస్తానీయులను ఏరివేయాలి



పహల్గామ్‌లో జరిగిన సంఘటన అత్యంత దారుణం. అమాయకులైన టూరిస్టులపై ఉగ్రవాదులు కాల్పులు జరపటం క్షమించరాని నేరం. ఉగ్రవాదాన్ని మట్టుబెట్టేందుకు ప్రపంచ దేశాలన్నీ ఏకం కావాలి. వివిధ కారణాలతో హైదరాబాద్‌కు వచ్చి తిష్ట వేసిన పాకిస్తానీయులను తక్షణమే అరెస్టు చేసి విచారించాలి.
-బండ వెంకట్‌రెడ్డి, బీజేపీ నాయకుడు

నగరంలో నిఘా పెంచాలి



ప్రజలను మతం పేరుతో హత్య చేస్తున్న ఉగ్రవాదులకు కఠిన శిక్షలు విధించాలి. దేశంలోని వివిధ జైళ్లలో ఉంటున్న ఉగ్రవాదుల విచారణను పూర్తి చేసి మరణదండన విధించాలి. ఉగ్రవాదుల తరపున ఏ న్యాయవాది కూడా కోర్టులో వాదించకుండా సరికొత్త చట్టం తీసుకురావాలి. ఉగ్రవాదులకు న్యాయ సహాయం అందిస్తున్న న్యాయవాదులపై కూడా నిఘా పెంచాలి.
-బాలాజీ, న్యాయవాది

సానుభూతిపరులే ఎక్కువ



అన్ని దేశాలు కూడా ఉగ్రవాద సంస్థలు, ఉగ్రవాదులను నామరూపాలు లేకుండా చేయాలి. పాకిస్తాన్ భారత్‌పై పోరాడడం మాని తమ దేశంలో ఉన్న ఉగ్రవాదంపై పోరాడాలి. మతాలకతీతంగా ప్రజలు ఉగ్రవాదంపై ఐకమత్యంగా పోరాడాలి. ఉగ్ర కదలికలు, సానుభూతిపరులు, స్లీపర్ సెల్స్‌పై తమకు తెలిసిన సమాచారం నిఘా సంస్థలకు ఇవ్వాలి. పహల్గామ్ హత్యాకాండ, ఉగ్రవాద చర్యలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా మద్దతు పలుకుతున్న వారిని గుర్తించాలి. -వరుణ్


ఆర్‌కేపురం చిత్రలేవుట్ కాలనీలో కొవ్వొత్తుల ప్రదర్శన..

ఉగ్రవాదులపై కఠిన చర్యలు తీసుకోవాలి

దిల్‌సుఖ్‌నగర్: పహల్గాంలో పర్యాటకులపై జరిగిన ఉగ్రవాదుల దాడిని నిరసిస్తూ ఆర్‌కేపురం డివిజన్ చిత్రా లేఔట్ లో కాలనీ అసోసియేషన్ అధ్యక్షులు పెండ్యాల నగేష్ ఆధ్వర్యంలో కాలనీ పార్క్ నుంచి అల్లూరి సీతా రామరాజు విగ్రహం వరకు శుక్రవారం కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగాగా కాలనీ వాసులు మాట్లాడుతూ ఉగ్రవాదుల దాడి పిరికిపంద చర్య అని దీని ద్వారా దేశ ప్రజల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయలేరన్నారు. ఈ ఘటన దేశ ప్రజలను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని అన్నారు. మృతుల కుటుంబాలకు ఆయన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఉగ్రదాడులు మళ్లీ జరుగకుండా కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు గణేష్, రేపాల మల్లికార్జున్, రెగట్టి సుధాకర్ రెడ్డి, కిషోర్ రెడ్డి, శరత్, ఎర్రం శ్రీనివాస్, రామకృష్ణ, ప్రవీణ రెడ్డి, సబితా రెడ్డి, వాణిశ్రీ, లావణ్య, శైలజ, స్వప్న, అంజల్ రావు, రఘునాథ్, సునీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


చేతికి నల్లబ్యాండ్‌లు ధరించిన ఎమ్మెల్యే బలాల తదితరులు

నల్లబ్యాండ్‌లతో నిరసన
మలక్‌పేట: మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల శుక్రవారం అక్బర్‌బాగ్‌లోని జామియా మసీద్‌లో ప్రార్థనలకు హాజరయ్యారు. ఈ సందర్భంగాగా ఎమ్మెల్యే, ముస్లింలు చేతికి నల్ల బ్యాండ్ ధరించి పహల్గాం దాడిని ఖండిస్తూ నిరసన తెలిపారు. అమాయక ప్రజలపై జరిగిన దాడిని ఎమ్మెల్యే తీవ్రంగా ఖండించారు.

ఉగ్రదాడికి నిరసనగా ర్యాలీ

చాదర్‌ఘాట్: పహల్గామ్‌లో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడులను నిరసిస్తూ శుక్రవారం మలక్‌పేట మార్కెట్‌లో నిరసన ర్యాలీ నిర్వహించారు, తెలంగాణ చాంబర్ ఆఫ్ అగ్రిట్రేడర్స్ అధ్యక్షుడు చేగూరి వెంకటరమణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీలో వ్యాపారులు, కమీషన్ ఏజెంట్లు రైతులు, కొనుగోలుదారులు, హమాలీలు, చాటకూలీలు పాల్గొన్నారు. పాకిస్తాన్ టెర్రరిస్టులకు వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేశారు. హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ మార్కెట్‌లోని వీధుల గుండా మార్కెట్ గేట్-1 నుంచి విజయవాడ జాతీయ రహదారి మీదుగా మార్కెట్ ఎగ్జిట్ గేట్=2 నుంచి ఎంట్రెన్స్ చెక్‌పోస్ట్ వరకు కొనసాగింది. ఈ సందర్భంగా కొవ్వొత్తులు వెలిగించి మృతులకు నివాళులర్పించి, సంతాపకంగా రెండు నిముషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా చేగూరి వెంకటరమణ మాట్లాడుతూ ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తూ అమాయక ప్రజలను పొట్టన పెట్టుకుంటున్న పాకిస్తాన్‌కు తగిన గుణపాఠం చెప్పాల్సిన సమయం ఆసన్నమైందన్నారు.

వ్యవసాయ మార్కెట్ బంద్
చాదర్‌ఘాట్: మలక్‌పేటలోని హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం మూడు గంటల పాటు వ్యాపార క్రయ విక్రయాలు నిలిచిపోయాయి. పహల్గామ్‌లో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడులను నిరసిస్తూ ఉదయం 8 గంటల నుండి 11 గంటల వరకు వ్యాపారులు, కమీషన్ ఏజెంట్లు, చాట కార్మికులు, కార్మికులు వ్యవసాయ అధికారులు ర్యాలీలో పాల్గొనటంతో క్రయ విక్రయాలు ఎక్కడికక్కడ ఆగిపోయాయి. ఏమి జరుగుతుందో తెలియక కొంతమంది మార్కెట్‌కు వచ్చిన వినియోగదారులు ఆందోళకు గురయ్యారు. చాదర్‌ఘాట్ పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.


మలక్‌పేట వ్యవసాయ మార్కెట్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న వ్యాపారస్తులు, కార్మికులు

మే డే ఉత్సవాల పోస్టర్ విడుదల


మేడే ఉత్సవాల పోస్టర్‌ను విడుదల చేస్తున్న సీఐటీయూ నాయకులు

దిల్‌సుఖ్‌నగర్: మేడే ఉత్సవాలను విజయవంతం చేయాలని సీఐటీయూ సరూర్‌నగర్ సర్కిల్ కన్వీనర్ మల్లేపాక వీరయ్య అన్నారు. శుక్రవారం ఆర్‌కేపురం డివిజన్ ఎన్టీఆర్‌నగర్ వ్యవసాయ మార్కెట్ లో మేడే పోస్టర్‌ను సీపీఎం సీనియర్ నాయకులు యం. గోపీనాయక్ ఆధ్వర్యంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా వీరయ్య, కట్ట శ్రీనివాస్‌లు మాట్లాడుతూ కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేస్తున్నదన్నారు. కార్మిక వర్గం దశాబ్దాలుగా పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను రద్దుచేసి కార్మికులకు ఉరితాళ్ల వంటి 4 లేబర్ కోడ్స్ అమలు చేసుకుందుకు చర్యలు తీసుకుంటుందన్నారు. కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్లను రద్దు చేయాలని హమాలీలకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేసి సంక్షేమ పథకాలు అములు చేయాలని కోరారు. 50 ఏళ్ల పైబడిన హమాలీలకు నేలకు రూ. 9 వేలు పెన్షన్ ఇవ్వాలని అసంఘటిత కార్మికిలందరికీ సామాజిక భద్రత చట్టం తీసుకురావాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 7 లక్షల మంది హమాలీ కార్మికులు ఉన్నారని తెలిపారు. హమాలీకు ప్రమాద బీమా. ఆరోగ్య బీమా పెన్షన్, పిఎఫ్, ఈఎస్ఐ బోనస్ వంటి చట్టబద్ధ హక్కులు అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. వచ్చే నెల 1న మేడే ఉత్సవాలను కార్మికులు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు సిహెచ్ వెంకన్న. టి మల్లేష్. పి శ్రీను, స్వామి, యస్. రవి, యండి సాలావో, దీన్ యం నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

మే డే వేడుకలను జయప్రదం చేయండి

మన్సూరాబాద్: అన్ని రంగాల్లో పని చేస్తున్న కార్మికులు మేడే వేడుకలను జయప్రదం చేయాలని సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు కీసరి నర్సిరెడ్డి అన్నారు. శుక్రవారం హయత్‌నగర్ కుంట్లూర్ రోడ్డులోని ఆటోస్టాండ్ వద్ద మేడే పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో పోరాటాలతో సాధించుకున్న చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిందని, లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మార్కెట్‌లో పెట్రో రేట్లు తగ్గితే భారత్‌లో విచ్చలవిడిగా పెట్రో రెట్లను పెంచి ఆటో కార్మికులను నష్టాలపాలు చేస్తున్నారన్నారు. కార్పొరేట్ సంస్థలైన ఊబర్, ఓలా, ర్యాపిడోతో ఆటో కార్మికులు రోడ్డున పడ్డారని, రాష్ట్ర ప్రభుత్వం ఆటో కార్మికులకు ఇస్తానన్న 12శాతం రాయితీని తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కడారి రాములు, ఓరుగంటి రాజుగౌడ్, అశోక్, జగన్మోహన్, వెంకటేషం తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నేతలు

అక్రమ నిర్మాణం నిలిపివేత


జయానగర్‌లో అక్రమ నిర్మాణాన్ని పరిశీలిస్తున్న సైదాబాద్ తహశీల్దార్ జయశ్రీ

సైదాబాద్: అక్రమ నిర్మాణంపై సీపీఐ నాయకులు చేసిన ఫిర్యాదుపై స్పందించిన సైదాబాద్ తహశీల్దార్ శుక్రవారం సంఘటనా స్థలాన్ని పరిశీలించి పనులు ఆపివేయించారు. ఐఎస్‌సదన్ డివిజన్ సీపీఐ కార్యదర్శి షేక్ మహమూద్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.. సైదాబాద్ డివిజన్ జయానగర్ కాలనీలో సైదాబాద్-సరూర్‌నగర్ ప్రధాన రహదారిపై యూనియన్ బ్యాంక్ పక్కన స్థలంలో ప్రభుత్వ భూమి ఉంది. ఇటీవల కొందరు వ్యక్తులు సదరు భూమిలో అక్రమంగా నిర్మాణ పనులు చేపట్టారు. దీంతో శుక్రవారం మహమూద్ సీపీఐ నాయకులతో కలిసి సైదాబాద్ మండల తహశీల్దార్ జయశ్రీకి ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన తహశీల్దార్ జయానగర్‌లోని స్థలం వద్దకు వెళ్లి పరిశీలించారు. ఈ స్థలం విషయమై క్లియరెన్స్ వచ్చే వరకు ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దని పనులు నిలిపి వేయించారు.

యూఎస్‌లో ఉన్నత విద్యకు స్పాట్ అడ్మిషన్లు


మాట్లాడుతున్న డాక్టర్ నిక్కిఫెనర్స్

చైతన్యపురి: యూఎస్‌లో ఉన్నత విద్య, గ్లోబల్ కేర్ అవకాశాల కోసం ప్రయత్నించే విద్యార్థులకు స్పాట్ అడ్మిషన్ల అవకాశం కల్పిస్తున్నట్లు జడ్సన్ యూనివర్సిటీ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ నిక్కిఫెనర్స్ అన్నారు. శుక్రవారం చైతన్యపురిలోని కెరీర్ వింగ్స్ కన్సల్టెన్సీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె వివరాలు వెల్లడించారు. జడ్సన్ యూనివర్సిటీ అనుబంధంగా శనివారం హిమాయత్‌నగర్‌లో స్పాట్ అడ్మిషన్ ఈవెంట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అప్లికేషన్ ఫీజు, ఐ20 డిపాజిట్స్ లేకుండా అడ్మిషన్ పొందవచ్చన్నారు. సీసీ ప్రెసిడెంట్ స్కాలర్‌షిప్‌తో సహా 9,200 స్కాలర్‌షిప్ లభిస్తుందన్నారురు. జడ్సన్ నుంచి గ్రాడ్యుయేట్ అయిన వారికి డైరెక్ట్ క్యాంపస్ ప్లేస్‌మెంటు అవకాశం కలిపించనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు 9052000710, 7995866681 నంబర్లలో సంప్రదించాలన్నారు.

అక్రమ ఆయుధం కలిగి ఉన్న వ్యక్తి అరెస్టు

నాగోలు: అక్రమ ఆయుధం కలిగి ఉన్న వ్యక్తిని నాగోలు పోలీసులు అరెస్టు చేసి అతడి నుంచి కత్తిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్టు చేసి శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బండ్లగూడ కృషి నగర్‌కు చెందిన రాసునూరి అఖిల్ కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. రెండు రోజుల క్రితం తన పుట్టినరోజు సందర్భంగా పెద్ద కత్తితో కేక్ కట్ చేసి ఇన్‌స్టాగామ్‌లో పోస్ట్ చేశాడు. దీనిపై సమాచారం అందడంతో నాగోలు పోలీసులు శుక్రవారం అతడి ఇంటిలో సోదాలు నిర్వహించి కత్తిని స్వాదీనం చేసుకున్నారు. ఈ మేరకు నిందితుడు అఖిల్‌ను అరెస్టు చేసి రిమాండ్ తరలించారు.

ఘనంగా అంబేడ్కర్ జయంతి ఉత్సవాలు

మన్సూరాబాద్: అంబేడ్కర్ మానవ శాస్త్రవేత్త అయినందునే దేశంలోని సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక అంశాలను లోతుగా అధ్యయనం చేసి రాజ్యాంగాన్ని రూపొందించారని పలువురు వక్తలు అన్నారు. శుక్రవారం జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జీఎస్ఐ)లో డాక్టర్ బీఆర్. అంబేడ్కర్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన జీఎస్ఐ ఏడీజీ సూరజ్ దామోజీ పట్‌బాజే, డాక్టర్ ఎన్. సిద్దోజీరావు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిద్దోజీరావు మాట్లాడుతూ దేశ అభ్యున్నతిలో అంబేడ్కర్ పాత్ర చాలా కీలకమని, ఆయన రాజ్యాంగాన్ని రచించి భారత ప్రభుత్వానికి అందించారన్నారు. రాజ్యాంగంలో ప్రాథమిక హక్కులు, ఆదేశిక సూత్రాలు పొందుపర్చారని, వెనుకబడిన కులాలకు రిజర్వేషన్లు కల్పించారన్నారు. అనంతరం అంబేడ్కర్ నూతన పొట్రెట్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో జీఎస్ఐ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ చైర్మన్ ఆదార్ల మహేష్, మాజీ రీజినల్ సెక్రటరీ మధిర సత్యనారాయణ, డీడీజీలు ఎల్ పీసింగ్, ఎంఎస్ ప్రవీణ్, ఎస్ఎస్ పాత్ర, అజయ్ నిర్వాన్, కేవి మారుతి, రవి, హార్మోహన్ మిషరా, తారకేశ్వర్‌రావు, రాజశేఖర్, లింగ్య, శ్రీనివాసరావు, అరుణ్‌కుమార్, మేగరాజ్, ప్రభాకర్, శివశంకర్, సునీల్‌కుమార్, ఆనంద్‌కుమార్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ రజతోత్సవ వేడుకలను విజయవంతం చేయాలి


మాట్లాడుతున్న కొప్పుల విఠల్‌రెడ్డి

నాగోలు: బీఆర్‌ఎస్ రజతోత్సవ వేడుకలను విజయవంతం చేసేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. ఈ నెల 27న వరంగల్‌లో నిర్వహించనున్న వేడుకల్లో భాగంగా శుక్రవారం ఎల్‌బీనగర్ నియోజకవర్గ పరిధిలో నాగోలు డివిజన్ జైపురికాలనీ, సాయినగర్ తదితర ప్రాంతాల్లో బీఆర్‌ఎస్ జెండా పండుగ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ నెల 27న వరంగల్ జరిగే సభకు నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు అనంతుల రాజిరెడ్డి, నాగోలు డివిజన్ అధ్యక్షులు చిరంజీవి, ఎల్‌బీనగర్ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు రంగేశ్వరి నాయుడు, శ్యామల యాదగిరి, శ్యామ్ సుందర్‌రెడ్డి, సతీష్‌యాదవ్, రమేష్, కాటేపాక రవి, తదితరులు పాల్గొన్నారు.

రజతోత్సవ సభకు భారీగా తరలుదాం
మన్సూరాబాద్: ఈ నెల 27న వరంగల్ నిర్వహించనున్న బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు పెద్ద ఎత్తున తరలి రావాలని మన్సూరాబాద్ మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మన్సూరాబాద్ కేబీఆర్ కన్వెన్షన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజలను అనేక హామీలతో మభ్య పెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించిందన్నారు. ఆరు గ్యారెంటీలు అమలు చేయలేక చేతులు ఎత్తేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై ప్రజలు అసంతృప్తితో ఉన్నారన్నారు. మాజీ సీఎం కేసీఆర్ బహిరంగ సభలో ఏమి మాట్లాడుతారోనని ఆసక్తిగా గమనిస్తున్నారన్నారు. కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి రజతోత్సవ సభను జయప్రదం చేయలని కోరారు. కార్యక్రమంలో నాయకులు వల్లపు అరుణ్‌బాబుయాదవ్, నాంపల్లి బాల్‌రాజ్, ఈశ్వర్, చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.


జైపురికాలనీలో బీఆర్‌ఎస్ జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి..

కాంగ్రెస్ కార్పొరేటర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలి

నాగోలు: జమ్మూ కాశ్మీర్‌లో టూరిస్టులపై జరిగిన ఉగ్రదాడుల దాడి నేపథ్యంలో బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉగ్రవాదుల దిష్టిబొమ్మ దహనం కార్యక్రమానికి సంబంధించిన ఫొటోలను మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన లింగోజిగూడ కాంగ్రెస్ కార్పొరేటర్ రాజశేఖర్ రెడ్డి పై కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని బీజేపీ రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షులు వనిపల్లె శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు బీజేపీ నాయకులతో కలిసి శుక్రవారం ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ ప్రజలు ఉగ్రవాద ఘటనపై ఆందోళన చెందుతున్న తరుణంలో కాంగ్రెస్ నాయకులు ప్రధాని మోదీ దిష్టి బొమ్మను దహనం చేసిన బీజేపీ కార్పొరేటర్లు అని మార్ఫింగ్ చేసి శునకానందం పొందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సామ రంగారెడ్డి, క్లోం రవీందర్ రెడ్డి, కార్పొరేటర్లు వంగ మధుసూదన్ రెడ్డి, క్లోం నవజీవన్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ కార్పొరేటర్‌పై పోలీసులకు ఫిర్యాదు
చైతన్యపురి: ప్రధాని నరేంద్రమోదీ ఫొటోను మార్ఫింగ్ చేసి తప్పుడు సమాచారాన్ని సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన లింగోజిగూడ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డిపై బీజేపీ కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి శుక్రవారం సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పహల్గామ్‌లో జరిగిన ఉగ్రవాద దాడిని నిరసిస్తూ ఎల్‌బీనగర్ చౌరస్తాలో బీజేపీ కార్పొరేటర్లు నిరసన కార్యక్రమం చేపట్టి ఉగ్రవాదుల దిష్టిబొమ్మ దహనం చేశామని, సదరు ఫొటోను మార్ఫింగ్ చేసి ప్రధాని దిష్టిబొమ్మ దహనం చేసినట్లు దర్పల్లి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారన్నారు. ఇలాంటి చర్యలకు పాల్పడిన కాంగ్రెస్ కార్పొరేటర్‌పై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని కోరారు.